




సంబేపల్లెలో కొప్పుల మంగమ్మకు పెన్షన్ అందజేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, చిత్రంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



దివ్యాంగుడు గొల్ల వెంకటేశ్వర్లుకు బ్యాటరీ సైకిల్ పంపిణీ చేస్తున్న సీఎం



హంద్రీనీవా ప్రాజెక్టుకు త్వరలోనే టెండర్లు పిలిచి ఆ పనులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టుకు పైసా కూడా ఇవ్వకుండా ఈ ప్రాంతవాసులకు తీరని అన్యాయం చేసిందన్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. శనివారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబు ఉమ్మడి కడప జిల్లా సంబేపల్లెలో పర్యటించారు. ఇద్దరు లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో మాట్లాడారు.



సంబేపల్లెలో జరిగిన సభలో సీఎంకు దండం పెడుతున్న మహిళలు

హంద్రీనీవా ప్రాజెక్టుకు త్వరలో టెండర్లు



- సీఎం చంద్రబాబునాయుడు
- లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- ఐటీ ఉద్యోగులతో ముఖాముఖి
- గ్రీన్ ఎనర్జీ కింద ఆరు ఆటోల పంపిణీ
- ప్రజల నుంచి విశేష స్పందన

రాయచోటి/సంబేపల్లె ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "మేముఅధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకు వేల కోట్ల రూపాయలు వ్యయం చేసి హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు చేశాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ ప్రాజెక్టు కోసం పైసా కూడా నిధులు కేటాయించ లేదు. మేమే 2019లో అధికారంలోకి వచ్చి ఉంటే 2020 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయి రైతులకు నీళ్ల అందేవి. త్వరలోనే.. ఈ ప్రాజెక్టు పనుల కోసం టెండర్లు పిలుస్తాం" అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆయన ఉమ్మడి కడప జిల్లాలోని సంబేపల్లెలోని సంతగేట్‌కాలనీలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి స్వయంగా అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రీన్ ఎనర్జీ కింద ఆరు ఆటోలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోలార్ బ్యాటరీతో నడిచే ఆటోలు అని, వీటిని ఉపయోగించుకుని కుటుంబాన్ని ఇబ్బందులు లేకుండా పోషించుకోవాలని తెలిపారు.

అనంతరం ప్రజావేదిక వద్ద ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఉమ్మడి కడప జిల్లాతో పాటు చిత్తూరు జిల్లాకు కూడా నీళ్లు అందేవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును పూర్తిగా పట్టించుకోకపోవడంతో రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ విజన్ స్వర్ణాంధ్ర-2047 మొదటి సూత్రమైన పేదరిక నిర్మూలనలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా పేదలకు ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి భరోసా కల్పిస్తూ ఆదుకుంటున్నారన్నారు. సంబేపల్లెలో గ్లోబల్ లాజిస్టిక్స్‌లో భాగంగా ఈ గ్రామంలో సంతృప్త స్థాయిలో ప్రతి ఇంటికి సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుకు రూ.1.64 కోట్లతో పనులు చేపట్టేందుకు శిలాఫలకం ఆవిష్కరించినట్లు తెలిపారు.

ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన సీఎం

సీఎం చంద్రబాబు నాయుడు సంబేపల్లెలోని కొప్పుల మంగమ్మ (82) ఇంటికి వెళ్లి ఆమెకు పింఛను మొత్తం రూ.4 వేలు అందచేసి మాట్లాడారు. పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకు ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పెంచిన పింఛన్‌తో జీవనం సాఫీగా నడుస్తోందని ముఖ్యమంత్రితో తన సంతోషం వ్యక్తపరిచారు. తనకు ఇల్లు లేదని, ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు మంజూరు చేయాలని అలాగే తన మనవరాలికి పింఛన్, మరుగుదొడ్డి మంజూరు చేయాలని ఆమె ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. వారికి ఇంటి స్థలం, పింఛను, మరుగుదొడ్డి మంజూరుతో పాటు సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సోలార్ విద్యుత్ యూనిట్, దీపం-2 కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కూడా మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు.

అనంతరం అదే గ్రామంలోని దివ్యాంగుడు గొల్ల వెంకటేశ్వర్లు ఇంటి వద్దకు వెళ్లి రూ.6 వేలు పింఛన్ అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచడంపై ముఖ్యమంత్రికి తన కృతజ్ఞతలు తెలిపారు. తనకు బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేయాలని కోరగా బ్యాటరీ సైకిల్ మంజూరు చేస్తున్నానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

30 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి : మంత్రి

నియోజకవర్గంలోని హెచ్ఎన్ఎస్ఎస్ శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు పూర్తి చేసి 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. శనివారం సంబేపల్లె ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రజా వేదికలో మండిపల్లి మాట్లాడుతూ తమది కరువు ప్రాంతమని రాష్ట్రమంతా వర్షాలు పడితే ఇక్కడ కరువు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పండ్ల తోటలను దృష్టిలో పెట్టుకుని కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని ముఖ్యమంత్రిని కోరారు. హంద్రీ-నీవా శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తే 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. రాయలసీమ జిల్లాలకు నీళ్లు ఇస్తే కరువు సీమ రతనాల సీమగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరు ఇచ్చి మీ రుణం తీర్చుకుంటానన్నారు. పోలవరం నుంచి బనకచర్ల ద్వారా రాయచోటికి నీటిని అందించి కరువు అనే మాట లేకుండా చేస్తామన్నారు. వ్యవసాయ విధానాలు కూడా మార్చుకోవాలని తెలిపారు. ఏ పంట వేస్తే లాభాలు సాధించవచ్చు అలాంటి పంటలను వేసుకొనే విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించాలని తెలియజేశారు.

రోడ్డు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన

సంబేపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1.64 కోట్ల అంచనాతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సంబేపల్లె మండల కేంద్రం సంత గేటు ప్రవేశద్వారం వద్ద ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి, అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా, అరవ శ్రీధర్, కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి పాల్గొన్నారు.

సీఎంకు ఘనస్వాగతం

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పర్యటనకోసం ప్రత్యేక విమానంలో వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కడప విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఏజీ అశోక్‌కుమార్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తదితరులు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, బి.హరిప్రసాద్ సీఎంను కలసి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి సత్కరించారు.



చంద్రబాబును సత్కరిస్తున్న గోవర్ధన్‌రెడ్డి, బి.హరిప్రసాద్

ఆలయ మాడవీధుల్లో కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



కల్పవృక్ష వాహనంపై వైకుంఠవాసుడు

కడప కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దేవునికడప శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. శనివారం ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన కల్పవృక్ష వాహనంపై వైకుంఠవాసుడు కొలువుదీరి భక్తులను కటాక్షించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనులారా తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య మాడవీధుల్లో స్వామివారు ఊరేగారు. అనంతరం స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై తిరుమలేశుడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీవారి ఊరేగింపులో కోలాటం, కేరళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై కటాక్షించిన వెంకటేశ్వరుడు

విద్యార్థులను దత్తత తీసుకోండి

- ట్రిపుల్‌ఐటీ పూర్వ విద్యార్థులకు వీసీ పిలుపు

వేంపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీల్లో చదువుతున్న విద్యార్థులను దత్తత తీసుకుని వారికి ఉన్నత ఉద్యోగ అవకాశాలు లభించేలా తమవంతు శిక్షణ ఇవ్వాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయకుమార్ పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పది సంవత్సరాల తర్వాత 2008 నుంచి 2014 వరకు ఇడుపులపాలయ ట్రిపుల్‌ఐటీలో చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అమెజాన్ వంటి పెద్ద కంపెనీల్లో కోటి రూపాయల వేతనం సాధించేలా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఇక్కడ చదువుకొని ప్రభుత్వ అధికారులుగాను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగాను, బ్యాంకుల్లోను పనిచేస్తున్న ప్రతి పూర్వ విద్యార్థి వారి అనుభవాన్ని కనీసం ఒకరిద్దరు విద్యార్థులకు తెలియజెబితే మంచి అవకాశాలు పొందుతారని ఇందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి భాస్కర్, ఏటి రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ విజయకుమార్

2008 విద్యార్థుల అపూర్వ కలయిక

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో రెండు రోజుల పాటు 2008 నుంచి 2014 వరకు చదివిన విద్యార్థులు సమావేశం కావాలని కార్యక్రమం రూపొందించారు. శనివారం ఉదయం నుంచే క్యాంపస్‌కు చేరుకున్నారు. సుమారు 250 మందికి పైగా పూర్వ విద్యార్థులు చేరకుని ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. చదువుచెప్పిన గురువులను కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఆరు సంవత్సరాల పాటు క్యాంపస్‌లో గడిపిన హాస్టల్ గదులను, అకడమిక్ బ్లాక్‌లను స్నేహితులతో కలిసి సందర్శించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

మహానాడును జయప్రదం చేయండి

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నడిబొడ్డుగా ఉంటున్న కడప ప్రాంతంలో మహానాడు నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని.. టీడీపీ శ్రేణులు మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరం ద్వారకానగర్‌ని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ ఏర్పాటైన తర్వాత మొదటిసారి మే 27, 28, 29 తేదీలలో కడపలో మహానాడు, ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 10 అసెంబ్లీ సీట్లకు గాను ఏడు సీట్లు గెలుపొందడంపై నాయకులు, కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ కృతజ్ఞతగా మహానాడు కడపలో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారన్నారు. ముఖ్యమంత్రి సూచనలతో త్వరలో కార్యక్రమానికి సంబంధించిన స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ

కడప క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తను మంగళగిరి రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలిపారు.



పింఛన్ల పంపిణీలో 11వ స్థానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లాకు 11వస్థానం లభించింది. 2,57,485 పింఛన్లు మంజూరు కాగా 2,45,296 పింఛన్లు పంపిణీ చేసి 95.27శాతం ప్రగతిని సాధించారు. సాంకేతిక కారణాల వల్ల పింఛన్ల పంపిణీ ఆలస్యంగా మొదలైనట్లు డీఆర్‌డీఏ అధికారుల సంఘం పేర్కొంది. పోరుమామిళ్ల, కడపలో పింఛన్ల పంపిణీ వీఆర్వోలకు అప్పగించారు. అయితే వారు జాయింట్ కలెక్టర్ కోర్టుకు హాజరుకావాల్సి రావడం వల్ల అక్కడ పింఛన్ల పంపిణీ మధ్యాహ్నం తర్వాత మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

వేతన జీవులకు ఊరట

- ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం
- కిసాన్ క్రెడిట్ పెంపు
- బడ్జెట్‌లో ప్రస్తావన లేని కడప ఉక్కు



(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేతన జీవులకు ఈసారి బడ్జెట్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కనికరం చూపించారు. ప్రతి ఏడాదీ పన్నులో మినహాయింపు ఉంటుందని ఎదురుచూస్తూ రావడం.. బడ్జెట్ మాత్రం షరా మామూలుగానే ఉండేది. అయితే ఈసారి కనికరించారు. వార్షిక ఆదాయం రూ.12లక్షల వరకు ఉంటే ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. శనివారం పార్లమెంటులో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించిన ప్రత్యేక కేటాయింపుల వివరాలు ఇంకా అందలేదు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ రాయలసీమ వాసుల చిరకాల వాంఛ. 2014 విభజన చట్టంలో కూడా ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పెట్టారు. అయితే అది సాధ్యం కాలేదు. ఇక జగన్ హయాంలో స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారే కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లో అయినా ఉక్కు పరిశ్రమకు హామీ ఇస్తారని ఆశ పెట్టుకున్నారు. దాని ఊసే ఎత్తలేదు. ఇక రైతులకు పంట రుణాల వ్యయ పరిమితిని పెంచారు. ఇప్పటిదాకా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి రూ.3లక్షలు ఉండేది. ఇప్పుడు అది రూ.5లక్షలకు పెంచారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగపడనుంది. ప్రతి ఏటా ఖరీఫ్, రబీలో పంటలు సాగు చేసేటప్పుడు రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీలకు తెచ్చుకుంటూ ఉంటారు. క్రెడిట్ పెంపుతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి జిల్లా రైతులకు విముక్తి కలగనుంది.

ఎంఎస్‌ఎంఈ లకు ప్రోత్సాహం

ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ఇంధనమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) లకు బడ్జెట్‌లో ప్రోత్సాహమిచ్చారు. కడపలో కొప్పర్తి పారిశ్రామికవాడలో ఇప్పటికే పలు ఎంఎస్‌ఈ యూనిట్లు ఉన్నాయి. మరికొన్ని ప్రారంభం కానున్నాయి. ఇక కొప్పర్తిలోనే స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దనుంది. సుమారు రూ.2200 కోట్లు పైగా ఖర్చు చేయనుంది. ఎంఎస్‌ఎంఈల యూనిట్ల స్థాపనకు కొప్పర్తి అనువైన ప్రాంతంగా ఉంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో వీటిని ప్రోత్సహిస్తూ వరాల జల్లు కురిపించారు. ఎంఎస్‌ఎంఈలకు రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు. వచ్చే ఐదేళ్లలో రూ.లక్షలన్నర కోట్లు అదనంగా రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ప్రకటించారు.

సామాన్యుల బడ్జెట్..

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడుతుంది. ఆదాయ పన్ను మినహాయింపు కోసం ఎన్నో ఏళ్లుగా వేతన, మధ్యతరగతి కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. వారి కలలను ఈ బడ్జెట్‌లో నెరవేర్చారు. ఇక రాష్ట్ర జీవనాడి అయిన పోలవరానికి నిధులు కేటాయించారు. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కొప్పర్తిలో పారిశ్రామికవాడను అభివృద్ధి చేయనున్నారు. ఇక రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మారనున్నాయి. ఇది అందరికీ ఉపయోగపడే బడ్జెట్.

- ఆర్.శ్రీనివాసరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రానికి మహర్దశ..



ఎన్డీయే నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధికి బంగారు బాటలు పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటికే కేంద్రం రాష్ట్రానికి నిధుల వరద కురిపిస్తోంది. ఈ బడ్జెట్‌లో కూడా ప్రాధాన్యత ఇచ్చారు. పోలవరం నిర్మాణ వ్యయ సవరణకు కేంద్రం ఆమోదించింది. ఇక ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించేందుకు రుణాలను రూ.5కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు. రూ.12లక్షలలోపు వరకు ఆదాయపన్ను లేకపోవడం పెద్ద ఊరట. కిసాన్ కార్డు క్రెడిట్ కార్డు పరిమితిని రూ.3లోల నుంచి రూ.5లక్షలకు పెంచారు.

- వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్ నిరాశపరిచింది..



కేంద్రంలో ఎన్డీయే సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులు, రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలను నిరాశపరిచింది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా బడ్జెట్ లేదు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. రైతులకు మద్దతు ధర పెంచడం, ఉపాధి అవకాశాలు సృష్టించే ప్రయత్నం చేయలేదు. ఈ బడ్జెట్ వల్ల ఒరిగేదేమీ లేదు. మరోసారి మొండి చేయి చూపారు.

- విజయజ్యోతి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు

కడప ఉక్కు ఊసే లేదు..



డబుల్ ఇంజను సర్కారుతో ఆంధ్రప్రదేశ్ ముందుకు పోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతుంటారు. అయితే కేంద్ర బడ్జెట్‌లో యువజన హామీలు పోను ఒక్కటి కూడా అమలుచేసే విధంగా పొందుపరచలేదు. కనీసం కడపలో ఉక్కుఫ్యాక్టరీ ప్రస్తావనే లేదు. వెనకబడిన జిల్లాల అభివృద్ధి ప్యాకేజీ కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం అన్యాయం. వేతన జీవులపై విధించే పన్ను విధానంలో శ్లాబు రూపంలో ఊరట కల్పించినప్పటికీ.. పరోక్ష పన్నుల ద్వారా దోపిడీకి దారులు తెరిచారు.

- గాలిచంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

వెనకబడిన ప్రాంతాలకు అన్యాయం..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వెనుకబడిన ప్రాంతాలకు, రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. రెండేళ్లుగా గిట్టుబాటు ధర కోసం రైతులు పోరాటం చేశారు. రైతు ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యత, విద్యుత్ సంస్కరణలు చేపట్టాలన్న డిమాండ్‌కు తిలోదకాలు ఇచ్చారు. విద్యుత్ సంస్కరణలకు పెద్దపీట వేయడం, అమలు చేస్తే 0.5 శాతం అదనంగా డబ్బులు ఇస్తామనడం రైతులను మోసం చేసినట్లే. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. బీజేపీ దేశ సంపదను ఆదాని, అంబానీలకు కట్టబెడుతోంది.



- రవిశంకర్‌రెడ్డి, ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి

100 దేశాల్లో 'సాఫ్ట్‌వేర్'లో మనవారే...

● ఐటీ రంగాన్ని యువతకు అందించాం ● ఆకాశమే హద్దుగా డబ్బులు సంపాదిస్తున్నారు
● సాఫ్ట్‌వేర్‌తో పాటు యువతను రాజకీయంగా ప్రోత్సహిస్తాం ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో జరిగిన ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు - సీఎంతో మాట్లాడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

సంబేపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో మన తెలుగు వారు, భారతీయులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సంబేపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబును సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కలిశారు. వారితో సీఎం మాట్లాడుతూ యువతకు టెక్నాలజీని పరిచయం చేశాం, హైటెక్ సిటీ కట్టాం, హైటెక్ టవర్ ఏర్పాటు చేశాం. ఐటీ చదువుకోవాలని ఆశ పుట్టించాం. దీంతో ప్రస్తుతం యువత సాఫ్ట్‌వేర్ రంగంలో సంపాదిస్తూ ఆదాయ మార్గాలను పెంచుకునేలా వివిధ మార్గాలను అన్వేషించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అభిప్రాయాలను సీఎం తెలుసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరికృష్ణ మాట్లాడుతూ కరోనా కాలంలో ఇంటి దగ్గర ఉంటూ 8 గంటలు పనిచేస్తూ నెలకు రూ.1.50 లక్షలు సంపాదిస్తున్నట్లు సీఎంకు తెలియజేశారు. సంబేపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు రూ.70 వేలు సంపాదిస్తున్నట్లు తెలిపారు. దావోస్ పర్యటనతో ఐదేళ్లలో రాజధానిలో ఐటీ డెవలప్‌మెంట్ చేయాలని తెలియజేశారు. గురిగింజకుంట వాసి శేఖర్‌నాయుడు తొమ్మిదేళ్లగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రాజకీయంగా గ్రామంలో ఎదుగుతున్నట్లు తెలిపారు. మోటకట్ల శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మీరు వేసిన ఐటీ ప్రాజెక్టులో తొలి మొక్కను నేను అని ప్రస్తుతం నా నెల ఆదాయం రూ.2.50 లక్షల రూపాయలని. వర్క్ ఫ్రం హోం ద్వారా నాకున్న 15 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబసభ్యులకు అండగా ఉన్నట్లు తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన శ్రీవిద్య నిరుపేద కుటుంబం నుంచి ఎన్నో కష్టాలు పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని తెలిపింది. హరీశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగం నుంచి నెలకు ఒకటిన్నర లక్ష వస్తుందని, దీంతో పాటు గొర్రెల పెంపకం యూనిట్ కూడా పెట్టుకుని అదనపు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. రెడ్డినడిమిరాజువారిపల్లెకు చెందిన ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ తాను ఇంటి దగ్గరే ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ద్వారా లక్ష పదివేల రూపాయలు సంపాదిస్తూ దీంతో పాటు పదెకరాల్లో టమోటా తోటను కూడా సాగు చేస్తున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన వెంకటేశ్ మాట్లాడుతూ రాజకీయంగా ఉండడంతో తనపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారని తెలిపారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా డబ్బు సంపాదించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నన్ను అరెస్టు చేస్తే ఎక్కడా లేని విధంగా నా మీద ప్రేమతో 53 రోజుల పాటు 80 దేశాల్లో రోడ్లపైకి వచ్చి వివిధ కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరం అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఐటీ భవనం నిర్మించేందుకు సాఫ్ట్‌వేర్ రంగానికి తాను చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రస్తుతం అమెరికా తలసరి ఆదాయం కన్నా మన తెలుగు యువత ఆదాయం రెండు శాతం అధికంగా ఉందంటే ఐటీ ఉద్యోగాలతోనే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం గ్రామీణ యువతకు సైతం అత్యంత సులభతరంగా ఆదాయ వనరుగా మారిన వర్క్ ఫ్రం హోంను కాస్త వర్క్ ఫ్రం నైబర్ హోం విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ముందుగా వివిధ నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న పలువురు సంబేపల్లె మండలంలోని స్థానికుల మనోభావాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కాపురానికి రాలేదని...

భార్యను నరికిన భర్త

అడ్డొచ్చిన అత్తపైనా దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య లలితమ్మ, అత్త రాధమ్మ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటి నుంచి రాకపోవడంతో మద్యం తాగి వెళ్లి గొడవపడ్డాడు. కొడవలితో దాడి చేశాడు. అడ్డొచ్చిన అత్తనూ నరికాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం బడన్నపల్లిలో శనివారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల్లోకెళితే....

నారాయణస్వామి, రాధమ్మ దంపతుల కూతురు లలితమ్మను కడప జిల్లా పులివెందుల తాలుకా వేముల మండలం భూమయ్యగారిపల్లి వాసి బ్రహ్మయ్య ఆచారికి ఇచ్చి 16 ఏళ్ల కిందట వివాహం చేశారు. విభేదాల కారణంగా ఏడాది కిందట లలితమ్మ పుట్టింటికి వచ్చింది. సంక్రాంతి పండుగ సమయంలో బడన్నపల్లికి వచ్చిన బ్రహ్మయ్య ఆచారి ఇకపై బాగా చూసుకుంటానని నమ్మించాడు. కుమారుడిని పండగకు తీసుకుపోయి, తిరిగి పంపలేదు. దీంతో గత నెల 28న వేముల పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ చేశారు. మూడునెలల తర్వాత లలిత కాపురానికి వస్తుందని, కుమారుడిని ఆమెతో పాటు పంపించాలని పోలీసులు చెప్పి పంపారు. ఈ క్రమంలో శనివారం బ్రహ్మయ్య ఆచారి మద్యం తాగి బడన్నపల్లికి వచ్చాడు. కాపురానికి ఎందుకు రావడం లేదని భార్యతో గొడవపడ్డాడు. వెంట తెచ్చుకున్న కొడవలితో భార్య లలితమ్మ, అత్త రాధామ్మపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గ్రామస్థులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లలితమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బ్రహ్మయ్య ఆచారి తన కుమారుడు నవదీప్‌ను బైకుపై ఎక్కించుకుని బత్తలపల్లి వైపు వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


అంగన్వాడీ కేంద్రంలో టీకాల పట్ల అవగాహన కల్పిస్తున్న జిల్లావైద్యాధికారి

వల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్లు, డ్రగ్గిస్ట్ రూములోని మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలో మందులు అయినపోయిన వెంటనే తెచ్చుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం గంగాయపల్లె అంగన్వాడీ కేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం సందర్శించి అక్కడ గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందుగా అంటువ్యాధులు రాకుండా వారికి సరైన విధానాలను తెలపాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుంటే పుట్టిన బిడ్డ పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. కాన్పులను ప్రభుత్వ ఆస్పత్రిలో చేయాలని, రోగులకు వైద్యసేవల గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడాలమిస్ట్ ఖాజామొహిద్దీన్, జిల్లా సూపర్‌వైజరు రాఘవ, స్థానిక డాక్టరు లక్ష్మీ ప్రసన్న, సీహెచ్‌ఓ వేణుగోపాల్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ ఏర్పాటు


నియామక పత్రం అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ నూతన కమిటీ సభ్యులను నియమించారు. నియామకపు పత్రాన్ని ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, నూతన కమిటీకి అందించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ జి.విజయభారతి (వాణిజ్య విభాగం, వైవీయూ, కడప) సభ్యులుగా డాక్టర్ కె.లలిత, (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ), డాక్టర్ బి.రెడ్డయ్య (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ), డాక్టర్ జి.నాగేశ్వర రెడ్డి (అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఈఈ, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొద్దుటూరు), డాక్టర్ ఎన్.గణేష్‌నాయక్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్) నియామకపు పత్రాలు పొందారు. ఈ స్థానంలో పనిచేసిన వారి పదవీకాలం పూర్తవడంతో వీసీ ఉత్తర్వుల మేరకు నూతన నియామకం చేశారు.

చెట్టు మీద పడి వ్యక్తి మృతి


నాగేశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ఖాజీపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చెట్టు కూలడంతో దాసరి నాగేశ్వరరావు (53) మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు బుడ్డాయపల్లె వాసి నాగేశ్వరరావు పనినిమిత్తం భార్యతో కలిసి ఖాజీపేటకు వస్తుండగా ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్కసారిగా చెట్టు కూలి పడింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. శ్యామలకు స్వల్ప గాయాలు కావడంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో నాగేశ్వరరావు మృతిచెందినట్లు వారు తెలిపారు. చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్గి రాసుకుంటూ ఒక్కసారిగా చెట్టు కుప్పకూలింది. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. యజమాని కోల్పోవడంతో పిల్లలు, భార్య బోరున విలపిస్తుండడం చూసిన గ్రామస్థులు కంట తడిపెడుతున్నారు.

వైవీయూ అంతర్‌కళాశాలల క్రీడాపోటీలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలల్లో 7,8 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్‌కళాశాలల హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొనే వారు 2024 జూలై 1 నాటికి 17ఏళ్ల పైన 25 ఏళ్లలోపు వారై విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో చదువుతూ ఉండాలన్నారు.

వంట మాస్టర్ ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల రోడ్డులోని ఓ మెడికల్ కళాశాల హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్న ఎండీ మన్సూర్ ఖాన్(43) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప తాలూకా ఎస్ఐ ప్రదీప్‌నాయుడు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కాకినాడ వాసి మన్సూర్ అలీ ఖాన్ విద్యార్థినులకు వంట చేసేవాడు. అతని భార్య ఫరియా బాలికల హాస్టల్ వార్డెన్‌గా పనిచేసేది. కొద్ది కాలంగా అనారోగ్యంతోనూ, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మానసిక ఉల్లాసం కల్పించేందుకే

బాలోత్సవాలు : డీఈఓ



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో మానసిక ఉల్లాసం కల్పించేందుకు బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. శనివారం కడప నగరం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో డాక్టర్ రాజా వెంగళరెడ్డితో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేసిన ఆయన మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు కల్చరల్ అకాడమీ ప్రోగ్రాంలో పాల్గొనడం ఉత్సాహంగా హాజరవడం ఆనందదాయకమన్నారు. మానసిక వికాసానికి, సైంటిఫిక్ టెంపర్ పెరిగేందుకు మానవతను పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. పిల్లల భవిష్యత్తుకు తోడ్పడేలా కార్యక్రమాలు రూపొందించినందుకు నిర్వాహకులను అభినందించారు. బాలోత్సవం గౌరవ సలహాదారులు వీరసుదర్శన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యాయులు ప్రొఫెసర్ మృత్యుంజయరావు, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉషాతులసి, సుందరయ్య, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మహేష్, ఎంఈఓ పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 12 అంశాలతో సీనియర్స్ జూనియర్స్ సబ్ జూనియర్స్ విభాగాల్లో మొదటి రోజు రెండో పిల్లల పండగ విజయవంతమైంది. జానపద నృత్యం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, రైమ్స్, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ అంశాల్లో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో 965 మంది పాల్గొనగా 12 అంశాల్లో నాలుగు వేదికలపైన నిర్వహించారు. ఆర్గనైజర్లు, కోఆర్డినేటర్లు, న్యాయనిర్ణేతలు, యాంకర్స్ వలంటీర్స్ పాల్గొన్నారు. మట్టిబొమ్మలు సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, దినపత్రిక పఠనం కథలు చెప్పడం, బెస్ట్ కార్టూన్స్, మెమొరీ టెస్ట్ నిర్వహించారు.

నకిలీ మద్యం రాకెట్ గుట్టురట్టు

ప్రధాన నిందితుడు వెంకటరమణ, మరో ఐదుగురి అరెస్టు ● ఆరు లక్షలు నగదు,కారు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన కడప జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది.

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గత నెల 29న అనంతరాజుపేట పంచాయతీలో జరిగిన నకిలీ మద్యం రాకెట్ గుట్టురట్టు అయింది. ప్రధాన నిందితుడు వెంకటరమణ సహా మరో ఐదుగురిని ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. కడప జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం రైల్వేకోడూరు ఎక్సైజ్ కార్యాలయంలో వెల్లడించిన వివరాల మేరకు... అనంతరాజుపేట పంచాయతీలో పట్టుబడిన అయ్యప్ప, వెంకట నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు తిరుపతి పట్టణం తిరుచానూరు వద్ద దామినేడు ఇందిరమ్మ ఇళ్ల సముదాయంలో బి.బ్లాక్ నెంబరు 61 ఇంట్లో 23 స్పిరిట్ క్యాన్, వివిధ బ్రాండ్లతో ఉన్న 1641 మద్యం సీసాలు, 805 లీట్లరు స్పిరిట్, 34 వేల నకిలీ లేబుల్స్, 1050 నకిలీ మద్యం సీసాలు, ఏడు వేల ఖాళీ సీసాలు మూతలు, ముడిపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యం రవాణా కోసం ఉపయోగించిన కారు, ఆరు లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని ప్రధాన నిందితుడు వెంకటరమణ, అతనికి సహకరించిన అతని బంధువు జయబాబును, చికెన్ శ్రీను, మహేశ్వరను అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం లభించిన సమాచారం మేరకు నకిలీ లేబుల్స్ తయారు చేస్తున్న ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడుకు చెందిన శివశంకర్ ఫొటో స్టూడియో యజమాని శివ శంకర్ నాయుడును అరెస్టు చేశారు. శివ శంకర్‌కు సహకరిస్తూ చిన్నఓరంపాడులో బెల్టు షాపు నిర్వహిస్తున్న నరసింహను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి స్పిరిట్ సరఫరా చేస్తున్న చరణ్‌జీత్ సింగ్, సీసా మూతలు సరఫరా చేస్తున్న అక్షయ్ పరారీలో ఉన్నారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు స్పిరిట్, ముడిపదార్థాలు విలువ రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో రాయచోటి టాస్క్‌ఫోర్స్ సీఐ ఎల్లయ్య, కోడూరు సీఐ తులసి, తిరుపతి ఎక్సైజ్ సీఐలు శ్యామ్ నాయుడు, నరసనాయుడు, రామచంద్ర కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠారెడ్డి, తిరుపతి ఎస్ఐలు స్వామినాథన్, హరికృష్ణ, జయశంకర్, మహేష్, కవీశ్వరనాయుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రావెల్స్ బస్సు ఢీ - ఒకరు మృతి

ప్రమాదంలో మరో ఆరుగురికి గాయాలు


సంఘటన స్థలంలో బోల్తాపడిన ఆటో, గాయాలపాలైన కూలీలు

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నేలతిమ్మాయగారిపల్లె సమీపంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆటోను ఢీకొట్టింది. ముకుంద ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి వేంపల్లెకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకెళితే... వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కూలీలు ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా నేలతిమ్మయ్యగారిపల్లె వద్ద హైదరాబాద్ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఆంజనేయులు, శ్రీనివాసులు, అంజనమ్మ, లక్ష్మయ్య, వీరయ్య, రమణమ్మ, చిన్నరాయుడుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరయ్య (7) మృతిచెందాడు. ఆంజనేయులు పరిస్థితి విషమసంఘటన స్థలాన్ని వీరపునాయునిపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

భారీ స్కోర్ దిశగా ఆంధ్ర

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రజట్టు భారీ స్కోర్ దిశగా సాగుతోంది. కడప నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకేనాయుడు ట్రోఫీ అండర్ 23 మల్టీడేస్ నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా శనివారం ఆంధ్ర- హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ నెగ్గిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్ ఎంచుకుని మొదటిరోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 360 పరుగులు భారీ స్కోరు సాధించింది. ఇందులో హేమంత్ రెడ్డి ఏకంగా 136 పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ వెంకటరాహుల్ 162 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

56 మద్యం బాటిళ్లు స్వాధీనం

లింగాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంబకపల్లెలో బెల్టుషాపుపై దాడి చేసి 56 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ రమణ, ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. పులివెందుల రూరల్ సీఐ రమణ ఆదేశాల మేరకు బెల్టుషాపు నిర్వహిస్తున్న శివగంగిరెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

మత్తు పదార్థాలకు నో చెబుదాం



మాట్లాడుతున్న సీఐ రమణారెడ్డి

కడప క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు నో చెబుదాం అని ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి సూచించారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప నగరంలోని శ్రీహరి డిగ్రీకళాశాలలో శనివారం యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలు కంటారని, కలలను బుగ్గిపాలు చేయవద్దన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటుపడి డబ్బు కోసం నేరాలకు పాల్పడుతూ మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాజాన్ని కాపాడాల్సిన యువతీయువకులు తమ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రాణాంతకమైన మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు నో చెప్పి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భర్త పింఛన్ భార్యకు పంపిణీ

వేంపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భర్త పీరా చనిపోగా ఆయన పింఛన్ వెం టనే ఈనెల నుంచే ఆయన భార్య షైమున్‌కు పంపిణీ చేసి కూటమి ప్రభు త్వం చేతల ప్రభుత్వమని రుజువు చేసుకుందని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. 1వ సచివాలయం పరిధిలో ఈ పింఛన్ పంపిణీ చేశారు. టీడీపీ నేత జబీఉల్లా పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని కుప్పం బ్రిడ్జి



పాపాఘ్ని నదిపై ప్రారంభానికి నోచుకోని కుప్పం-రాజుపల్లె బ్రిడ్జి

చక్రాయపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పం-రాజుపల్లె మధ్యన పాపాఘ్ని నదిపై నిర్మించిన బ్రిడ్జి నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణం పూర్తయింది కానీ నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేకపోవడంతో పూర్తైన బ్రిడ్జిని ఏడాది కావస్తున్నా ప్రారంభించ లేదు. వివరాల్లోకెళితే... రెండేళ్ల క్రితం కుప్పం బ్రిడ్జి కోసం రూ.35కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పనులు దక్కించుకున్నారు. రెండేళ్లలోపే బ్రిడ్జిని పూర్తిచేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు బ్రిడ్జి ప్రారంభానికి నోచుకోకపోవడంతో పాపాఘ్ని నది పరవళ్లు తొక్కినపుడు తాత్కాలిక రోడ్డు తెగిపోవడం, మరమ్మతులు చేయించడంతో సరిపోతోంది. రైతులకు నష్టపరిహారం చెల్లిస్తే బ్రిడ్జి ప్రారంభమవుతుంది. రాకపోకలకు ప్రధానంగా కల్లూరుపల్లె, ఎర్రగుడి, బీఎన్‌తాండా, గరుగుతాండా, గోగన్‌పేట, ఎన్‌పీకుంట ప్రాంతాల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాపాఘ్ని నదీ తీరప్రాంతవాసులు కూడా మండల కేంద్రానికి రావాలంటే వ్యయప్రయాసాలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కుప్పం, రాజుపల్లె రైతులకు పరిహారం అందించి బ్రిడ్జిని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

భూములకు పరిహారం అందించాలి



కుప్పం-రాజుపల్లె మధ్య పాపాఘ్ని నదిపై బ్రిడ్జి లేక నదీ తీరప్రాంత వాసులు అనేక కష్టాలు పడేవారు. బ్రిడ్జి అయితే కట్టారు కానీ భూముల నష్టపరిహారం ఇవ్వకపోవడంతో పూర్తైన బ్రిడ్జిని ప్రారంభించలేకపోతున్నారు. సిద్ధారెడ్డిగారిపల్లె నుంచి మండల కేంద్రానికి రావాలంటే 20 కిలోమీటర్లు తిరిగి రావాలి. వెన్నపల్లె-గండికొవ్వూరు వద్ద బ్రిడ్జి నిర్మిస్తే మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరమే. కావున అధికారులు స్పందించి కుప్పం బ్రిడ్జిని ప్రారంభించి గండికొవ్వూరు బ్రిడ్జి కూడా నిర్మించాలి.

- ఓబయ్య, చక్రాయపేట మండలం

విద్యుత్ శాఖ రూరల్ ఏఈగా రమేశ్‌రెడ్డి



పులివెందుల రూరల్ ఏఈగా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ పులివెందుల మండల రూరల్ ఏఈగా ఈకే రమేశ్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఏఈ మురళి అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. పులివెందుల టౌన్ ఏఈగా పనిచేస్తున్న రమేశ్‌రెడ్డిని రూరల్ ఏఈగా నియమించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే వినియోగదారులు కూడా తమకు సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఏడీఈ గురుమోహన్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టరు జగన్మోహన్‌రెడ్డి, కాంట్రాక్టరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల ప్రస్తావన లేదు

● సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకపోయారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ప్యాకేజీపై కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. దేశానికి తిండిపెట్టే రైతులను కాపాడేందుకు, వ్యవసాయాన్ని పరిరక్షించేందుకు బడ్జెట్ కేటాయింపులు పెరగడం లేదన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్: సీపీఎం

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ బడ్జెట్ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక బడ్జెట్ అన్నారు. మోదీ ప్రభుత్వ సంస్కరణల కారణంగా దేశం అధోగతి పాలైందని, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలతో ఆర్థికంగా చిన్నాభిన్నం అయిందని విమర్శించారు.

బడ్జెట్‌లో రైతులకు అన్యాయం : ఆర్పీపీ

ఈ బడ్జెట్ రైతులకు తీరని అన్యాం చేసిందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. అలాగే ఉక్కు ప్యాక్టరీని ఏమాత్రం పరిగణలోకి తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

ఉక్కు మాట లేకపోవడం దారుణం

కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. కడప ఉక్కు ఎన్నికల స్టంట్‌లాగా మిగిలిపోతోందన్నారు.

ఇది సామాన్యుల బడ్జెట్: బీజేపీ

వేంపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో కేంద్రమంత్రి సామాన్యులను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు రూ.5 లక్షల వరకు పెంచారని, స్వల్పకాలిక రుణాలను రూ.5లక్షలు చేశారని, ఆదాయపు పన్ను మినహాయింపు రూ.12లక్షల వరకు పెట్టారని తెలిపారు.

ఉద్యోగ,ఉపాధ్యాయులకు మేలైన బడ్జెట్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈ బడ్జెట్‌లో కొంత ఊరట లభించిందని ఉద్యోగ ఉపాధ్యాయ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఐటీ రిటర్న్ చెల్లింపుల్లో లాభదాయకంగా ఉన్నట్లు స్పష్టం చేస్తున్నారు. ఈ సందర్భంగా పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఏపీటీఎఫ్ అమరావతి నేతలు, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటజనార్దన రెడ్డి మాట్లాడారు.

కల్యాణం.. కమనీయం



మాంగల్యాన్ని చూపుతున్న వేద పండితులు

వల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లఓబాయపల్లెలోని సీతారామ హనమత్సమేత దేవస్థానంలో రెండోరోజు వేద పండితులతో పాటు భక్తులు కలిసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు.

'కమ్మ సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెస్తాం'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కమ్మసామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెస్తాం అని ఆ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు పి. నాగేశ్వర్‌రావునాయుడు అన్నారు. శనివారం చిన్నచౌకులోని కమ్మ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గాన్ని రాజకీయంగా బలోపేతం చేస్తామన్నారు.

నూతన కార్యవర్గం

సంఘం గౌరవ అధ్యక్షుడిగా దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడిగా పల్లినేని నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీగా వేలూరి రవిచంద్ర, ట్రెజరర్‌గా ఇప్పర్ల పూర్ణచంద్రవరావు, కమిటీ సభ్యులు ఇప్పర్ల శివశంకర్, దామనచర్ల పవన్‌కుమార్, గుత్త ప్రసాద్‌నాయుడు, ఇప్పర్ల నాగేంద్ర, వి.సుబ్బరాయుడు, బి.శంకర్, ఎం.సుధాకర్‌నాయుడు, కలవకూరి చిన్న వెంకటసుబ్బయ్య, వైకుంఠం మదన్‌మోహన్ నాయుడు, భవానీ శంకర్, కొమ్మ హనుమంతనాయుడు, కామినేని ప్రవీణ్, కొల్లి రామసుకుమార్, దానంచర్ల శ్రావణ్ ఎన్నికయ్యారు.

నేత్ర వైద్య సేవలు అభినందనీయం

● జిల్లా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రజలకు అందిస్తున్న నేత్ర వైద్య సేవలు అభినందనీయమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి అన్నారు. శనివారం కడప నగరంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాంగణంలో మొదటి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి మాట్లాడుతూ ఎల్వీపీఈఐ సేవలు కొనియాడారు. ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఎల్‌వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, డాక్టర్ రమేష్, డాక్టర్ అవినాష్ పట్బంగి పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో సంబరాలు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):తపాలా జీవిత బీమా పాలసీ ఏర్పాటై 141 వ సంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక ప్ర ధాన తపాలా కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్ కేక్‌కట్ చేసి తపాలా సిబ్బంది, కస్టమర్లకు అందించి మాట్లాడారు. పీఎల్ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) రోజురోజుకు ప్రాచుర్యం పొందుతూ రికార్డు స్థాయిలో పాలసీలు సొంతం చేసుకుందన్నారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు విజయ్‌భాస్కర్, పీఎల్ఐ డెవలప్‌మెంటు ఆఫీసరు మునాఫ్ పాల్గొన్నారు.

మెప్మా పీడీ బాధ్యతల స్వీకరణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎం.కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీడీగా పనిచేసిన సురేశ్‌రెడ్డిని ప్రభుత్వం ఎక్సైజ్ శాఖకు బదిలీ చేసింది. కిరణ్‌కుమార్‌ను ఏడాది పాటు మెప్మా పీడీగా డిప్యుటేషన్‌పై నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు తీసుకున్నారు. నూతన పీడీకి మెప్మా కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేయండి

● డీఆర్వోకు వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్ మహేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ డీఆర్వో కార్యాలయంలో డీఆర్ఓ ఎం.విశ్వేశ్వరనాయుడికి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మే మాసంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వహించారన్నారు. డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. డీఆర్ఓ స్పందిస్తూ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

వేంపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె తల్లిశెట్టి సుబ్రమణ్యం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు పూర్వ విద్యార్థి, ప్రస్తుత టీడీపీ యువ నేత సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి రూ.10 వేల విరాళాన్ని ప్రధానోపాధ్యాయుడు మునెమ్మకు అందించారు. దాతలు ముందుకు రావడం మంచి పరిణామమని ఉపాధ్యాయులు దా తను అభినందించారు. పాఠశాల చైర్మన్ బు జ్జి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ పాఠశాలలో రజనీకాంత్ రెడ్డి 1992- 93లో 10వ తరగతి చదివారు.

రోడ్డుపై ఆయిల్ - కింద పడిన పలువురు

కడప క్రైం,, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మృత్యుంజయకుంట శివాలయం వద్ద రోడ్డుపై ఆయిల్ పడడంతో వెళ్లే పలువురు బైకు స్కిడ్ అయి కింద పడ్డారు. రాత్రివేళ రోడ్డు మధ్యలో ఆయిల్ పడి ఉండడంతో వారు ఆయిల్‌పై మట్టి వేయకపోవ డం, అలాగే వెళ్లిపోవడంతో ఆ రహదారిపై వెళ్లే వారు ఆయిల్ గమనించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు పలువురు కింద పడి గాయాల పాలయ్యారు. గాయపడిన వారు వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లారు. దీంతో అక్కడున్న వారు ఆయి ల్ ఉన్న రోడ్డుపై మట్టిని చల్లారు. ఆయిల్ చేజా ర్చుకున్నవారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫెన్సింగ్ తొలగింపుపై కేసు నమోదు

సికెదిన్నె, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ తొలగింపుపై కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. మంత్రి వసంతకుమారి తనయుడు మంత్రి కిరణ్‌కుమార్ తమ అమ్మపేరుతో ఉండే స్థలం శనివారం తెల్లవారుజామున ఒంటిగంటపైన పగడాల సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మరికొందరు కలిసి పెన్సింగ్, అందులోని డెకరేషన్ సామాగ్రిని నష్టపరిచినట్లు తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.17 లక్షలకుపైగా ఉంటుందన్నారు.కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు లక్ష్మీతిరుమలేశ్వర స్వామి వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలోని శ్రీలక్ష్మీ తిరుమలేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామి వారి కళ్యాణక్షత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. రెండు రోజుల పాటుజరిగే ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన ట్రైనీ డీఎస్పీ

కడప క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను శనివారం ట్రైనీ డీఎస్పీ పీటీ భవానీ పోలీసు అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమెకు ప్రాక్టికల్ ట్రైనింగ్ నిమిత్తం కడప జిల్లాకు కేటాయించడంతో ఇక్కడే శిక్షణ పూర్తి చేయనున్నారు.

యూసీఐఎల్ అధికారులకు ఘనంగా వీడ్కోలు

వేముల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ జనరల్ మేనేజర్ ఎంఎస్ రావు, చీఫ్ మేనేజర్ (పర్సనల్) సంజయ్ ఛటర్జీలకు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం వారి పదవీ విరమణ సం దర్భంగా యూసీఐఎల్‌లో వీడ్కో లు కార్యక్రమం ఏర్పాటు చేయ గా పెద్ద సంఖ్యలో ఉద్యోగుల, కుటుంబ సభ్యులు హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఎంఎస్ రావు, సంజయ్‌ఛటర్జీ మాట్లాడుతూ యూసీఐఎల్ తుమ్మలపల్లెలో తమ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ అక్కడున్న అందరి హృదయాలను ఆకట్టుకున్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎండీ డాక్టర్ సంతోష్‌కుమార్ సత్పతి, టెక్నికల్ డైరెక్టర్ మనోజ్‌కుమార్, జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, డీజీఎం కిషోర్ భగత్, ఎస్ఎంఎస్ఐఎల్ అధికారులు చౌదరి, ఖలీల్ తదితర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరుణగల తల్లి లూర్దుమాత

కడప కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మరియాపురంలో వెలసిన లూర్దుమాత కరుణగల తల్లి అని, ఆమె తిరుణాల ఈ నెల 10,11 తేదీల్లో నిర్వహిస్తున్నామని, విజ యవంతం చేయాలని చర్చి విచారణ గురువు మరియన్న తెలిపారు. శనివారం మరియాపురం చర్చి ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప మేత్రాసన బిషప్ గాలిబాలి ఆధ్వర్యంలో తిరుణాల మహోత్సవాలను జరగనున్నట్లు స్పష్టం చేశారు. కమిటీ అధ్యక్షుడు రాయప్ప, వైస్ ప్రెసిడెంట్ బాలశౌరి పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు

● టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వైసీపీ వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని శనివారం వైవీ సుబ్బారెడ్డి పరామర్శించారు. వైఎస్ అభిషేక్‌రెడ్డి తాత వైఎస్ ప్రకాష్‌రెడ్డి, తండ్రి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు ఏమేరకు అమలు చేస్తారో 2014 నుంచి 2019 వరకు చూశారన్నారు. 2024 సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చారు ఇంత వరకు ఏమేరకు పథకాలు అమలు చేస్తున్నారో అందరూ చూస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. పథకాలు అమలు చేయలేక కుంటిసాకులు చెబుతున్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టిన కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు తమ పార్టీ సిద్ధమవుతోందన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే అది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

ఇకపై విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభతరం

సింహాద్రిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ వినియోగదారులకు ఇకపై బిల్లుల చెల్లింపు సులభతరమని విద్యుత్ ఏఈ దినేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ శాఖ వారు ప్రతి నెలా మొదటి వారంలో మీటరును స్కాన్ చేయడం ద్వారా బిల్లు ఇస్తున్నారు. ఫిబ్రవరి నెల నుంచి మీకు ఇచ్చే బిల్లు కింది భాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించబడి వుంటుంది. దీంతో మీ వీలునుబట్టి ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మీరెంత బిల్లు చెల్లించాలో వివరాలు మీ సెల్‌కు వస్తుంది. విద్యుత్ కార్యాలయంకు వెళ్లకుండా ఒక్క నిమిషంలో మీ బిల్లు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ దినేష్ కుమార్ కోరారు.



చెర్లోపల్లె అక్రమ రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు

సికెదిన్నె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం చెర్లోపల్లె లేఅవుట్‌లో గతంలో పనిచేసిన సెక్రటరీ ఓబులేసు సంతకాన్ని ఫోర్జరీ చేసి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిపినట్లు సికె దిన్నె పోలీసు స్టేషన్‌లో ప్రస్తుత పంచాయతీ సెక్రటరి శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొన్ని ముఠాలు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతూ బదిలీ అయిన సెక్రటరీ సంతకాన్ని ఫోర్జరీ చేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పంచాయతీ సెక్రటరీ సంతకం, పంచాయతీ కార్యాలయ ముద్రను ఫోర్జరీ చేసినట్లు తెలిపారు. అందుకు కారకులైన వన్నేరు సుబ్రమణ్యం, చిట్టిబాబు మరికొందరిపై చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇళ్లు లేకున్నా నకిలీ సీళ్లు, సంతకాలతో రిజిస్ట్రేషన్‌చేసి లోన్లు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. అటువంటివారిపై కూడా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'బీమా రంగానికి నష్టం'

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74శాతం నుంచి వందశాతంకు పెంచడం బీమా రంగానికి, పాలసీదారులకు మేలు చేయదని కడప డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. వందశాతం ఎఫ్‌డీఐ అంటే అర్థం స్వదేశీ భాగస్వామి కంపెనీ లేకుండానే ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారతదేశంలో నేరుగా ఏర్పాటు కావడం. ఇదే జరిగితే దేశంలో 1956కు ముందు పాలసీదారులను ముంచేసిన మోసాలు పునరావృతం అవుతాయన్నారు. ఏఐఐఈఏ ఆధ్వర్యంలో ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాలు విడుదల

● 72 శాతం ఉత్తీర్ణత



ఫలితాలను విడుదల చేస్తున్న కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ భాస్కర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీనగర్‌లోని శ్రీహరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ ప్రథమ సెమిస్టర్ ఫలితాలను కళాశాల కరస్పాండెంట్ జి.సుబ్బారెడ్డి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.భాస్కర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల్లో 72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సా ధించారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోల్ ఎస్.ముత్తహర్, ఆంజనేయులు, పరీక్షల విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో విభజన హామీలేవీ..'

జమ్మలమడుగు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ బీజేపీ ఎన్నికలబడ్జెట్‌గా మారిందని, మరోసారి విభజనహామీల ప్రస్తావన లేకుండాపోయిందని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేసినట్లేనని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. శనివారం జమ్మలమడుగులోని చిటిమిటి చింతల గ్రామాన్ని సందర్శించిన ఆయన శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు

కొండాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన అభ్యర్థులు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ 50 శాతం ఉంటుందన్నారు. అభ్యర్థులు 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, తెల్లరేషన్‌కార్డు, ఆధాయధృవీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 7 వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలో శనివారం జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్ర బాబును ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రేపటి నుంచి మైలవరం జలాశయంపై రాకపోకలు నిలుపుదల

మైలవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం గేట్ల పైభాగాన రహదారిని సోమవారం నుంచి రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు జలాశయ డీఈ నరసింహమూర్తి శనివారం తెలిపారు. మైలవరం జలాశయంపై రక్షణ గోడలు అధ్వానంగా ఉండడంతో రూ.33 లక్షల నిధులు విడుదల చేయడంతో సోమవారం నుంచి పనులు మొదలు పూర్తయ్యేంతవరకు రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేయనున్నట్లు డీఈ తెలిపారు.



పేరుకే 50 పడకల ఆసుపత్రి

పేషంట్లు ఎక్కువ... డాక్టర్లు తక్కువ ● కూటమి ప్రభుత్వంలో అయినా పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరిగేనా..?

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు వెచ్చించి పేద ప్రజానీకానికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి నిర్మించినా అందులో అవసరమైన వైద్యులను నియామకం జరపకపోవడంతో పూర్తిస్థాయిలో ప్రజలకందాల్సిన వైద్య సేవలు అందనంత దూరంగా ఉండిపోయాయి. ప్రతిరోజూ ఈ ఆసుపత్రికి వచ్చే పేషంట్లు ఎక్కువ శాతం ఉన్నా వైద్యులు మాత్రం తక్కువ మంది ఉన్నారు. గతంలో పోరుమామిళ్లలో ఉన్న30 పడకల ఆసుపత్రిని మరో రూ.3కోట్ల వ్యయంతో నూతన భవనం నిర్మించి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. దానికి సంబంధించిన వైద్యుల నియామకం జరుగుతున్నా ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలందిస్తామని నాయకులు చేసిన వాగ్దానాలు చేశారే తప్ప వైద్యులను నియమించడంలో కానీ ఆసుపత్రి పనితీరు ఎలాఉందని పర్యవేక్షించిన పాపానపోలేదు. దీంతో చాలామంది ప్రైవేటు ఆసుపత్రుల వైపు మొగ్గు చూపడం,మరికొందరు కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లడం పరిపాటి అయింది. పోరుమామిళ్లలోని 50పడకల ఆసుపత్రిలో 14 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా 11 మంది మాత్రమే ఉన్నారు. వారిలో వచ్చేది 7 గురు. గైనకాలజిస్ట్ ఎప్పుడు చూసినా కొద్దిరోజులు రావడం, ఉన్నట్లుండి సెలవు పెట్టడం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకోవడం పరిపాటైంది. చిన్నపిల్లల వైద్యులు కూడా మెడికల్ లీవులో వెళ్లిపోయారు. మత్తు డాక్టరు కూడా సెలవుపై వెళ్లారు. మరో వైద్యురాలు మెటర్నిటీ లీవు తీసుకోవడంతో ప్రజలకు సమస్య ఏర్పడింది. జనరల్ మెడిసిన్ అందించే వైద్యుడు లేరు. జనరల్ సర్జన్ పోస్టు ఖాళీ అయింది. ప్రతిరోజూ దాదాపు 300 మంది రోగులు ఆసుపత్రికి వచ్చి పోతుంటారు. అంతేకాక



కలసపాడు, కాశినాయన, బికోడూరు పోరుమామిళ్లకు ప్రధాన బిందువు కావడంతో ఎక్కడ ఏ చిన్న పమాదాలు జరిగినా, వైద్యం కోసం మొదట ఆశ్రయించేది ఆధారపడేది పోరుమామిళ్ల ఆసుపత్రి పైనే. అలాంటి ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడం విడ్డూరంగా ఉంది. అంతేకాక ఆర్థోపెడిక్‌కు సంబంధించిన సియాం, స్కానింగ్ చేసే పరికరం లేకుండా పోయింది. ఎక్స్‌రే మెడిసిన్ వచ్చింది కానీ అందకు సంబంధించిని ఫిల్మ్ రాలేదు. ఈఎన్‌టి పరికరాలు, కంటి డాక్టరుకు సంబంధించిన పరికరాలు కొరతగా ఉన్నాయి. కొందరు వైద్యులు ఎప్పుడుబడితే అప్పుడు సెలవులు పెట్టడంతో ఉన్న వైద్యుల తోనే ఈ ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. కొద్దిరోజులు ఒక సూపరింటెండెంట్, మరికొది రోజులు ఇంకొకరు ఆసుపత్రి బాధ్యతలు తీసుకోవడం వల్ల పూర్తి అజమాయిషీ లేకుండాపోయింది. ఎవరిని ఏమన్నా ఏం నొచ్చుకుంటారో అనిభావించి తమ పని తాము చేసుకుని పోతున్నారు కొందరువైద్యులు. ప్రధాన ప్రతినిధులుకు కేంద్రమైన పోరుమామిళ్లలో ఈ ఆసుపత్రిపై అజమాయిషీ లేకపోవడం, వైద్యులను నియమించడంలో వారు విఫలం కావడం ప్రధానకారణమైంది. నాలుగు మండలాలక కేంద్ర బిందువుగా ఉన్న ఈ 50పడకల ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరిగితే గ్రామీణ ప్రాంత ప్రజలు ఇతర ప్రైవేటు ఆసుపత్రుల వైపు చూసే అవకాశం లేకుండాపోతోంది. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సుధా వైద్యుల నియామకానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తనిఖీలకు మాత్రం డిప్యూటీ డీఎంహెచ్‌వో, డీఎంహెచ్‌వోలు ఆసుపత్రికి వచ్చి పోతున్నారే కానీ ఇక్కడ వైద్యుల గురించి ఏ మాత్రం శ్రద్ధ చూపడంలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చొరవ తీసుకుని వైద్యుల నియామకం చేస్తే పూర్తిస్థాయిలో పేద ప్రజలకు వైద్యమందే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాధ్యతలను ఈఎన్‌టీ డాక్టరు నాగేంద్ర చూస్తున్నారు. ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి లక్షలాది రూపాయలు జీతాల కోసం ఖర్చు పెడుతున్న ప్రభుత్వం వైద్యులను పూర్తిగా నియామకాలు జరిపి నిర్వహణపై సరైన బాధ్యతలు తీసుకుంటే ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో పేరెన్నికగల ఆసుపత్రిగా నిలిచిపోయే అవకాశాలున్నాయి. మరి ఎప్పుడు పూర్తిస్థాయి లో వైద్యులు నియామకం జరుగుతుందో ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు అందుతాయో వేచి చూడాల్సిందే. ప్రస్తుతం ఉన్న వైద్యులతోనే వైద్యసేవలు అందిస్తున్నామని ఈఎన్‌టీ స్పెషలిస్ట్ ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ నాగేంద్ర తెలిపారు.

సమష్టి కృషితో అభివృద్ధి చేస్తాం

మల్లీశ్వరి, ఎంపీడీఓ



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసి గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేస్తాం. మండల పరిధిలో ఏ గ్రామంలోనైనా వారికి సమ స్యలు ఎదురైతే తమ దృష్టికి తేవాలని, సమస్యలు పరిష్కరిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం ఏర్పడకుండా ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకా లన్నీ అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతామంటున్న బద్వేలు ఎంపీడీఓ మల్లీశ్వరితో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

ప్రశ్న : మండల పరిధిలో ఎన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, జనాభా ఎంత. ?

జవాబు : మండల పరిధిలో 10 గ్రామ పంచాయితీలు,9సచివాలయాలు ఉన్నాయి. 21,317 మంది జనాభా కలిగి ఉన్నారు.

ప్రశ్న : గ్రామాల్లో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జవాబు : మండల పరిధిలో ప్రతి గ్రామా నికి ఏర్పాటు చేసిన గ్రీన్‌అంబాసిడర్లు (శానిటేషన్‌లు) చెత్త సేకరణ చేస్తారు. సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి సంపదను ఉత్పత్తి చేస్తారు.

ప్రశ్న : కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వివరించండి ?

జవాబు : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజబుల్ అసెస్ట్ (కంటికి కనిపించే) పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్లు, అవసరమైనచోట్ల ప్రహరీగోడ నిర్మాణాల వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరలోనే గ్రామాల్లో ఆర్‌ఓప్లాంట్ ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరవుతాయి.

ప్రశ్న : గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమం అందుతోందా ?

జవాబు : గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. స్వర్ణాంధ్రసర్వే 2047 సచివాలయ సిబ్బంది తో ఇంటింటి సర్వే చేయిస్తున్నాం. అర్హులు ఎవరికైనా సంక్షేమం వర్తించకుండా ఉంటే అందుకు సంబంధించిన సమస్యను గుర్తించి వారికి కూడా సంక్షేమాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : మండలంలో అభివృద్ధి పనులకు నిధులు ఎన్ని మంజూరయ్యాయి ?

జవాబు : గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల ద్వారా రూ.93లక్షల నిధులను మంజూరు చేశాం. సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు దాదాపు రూ.2.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఉపాధిహామీ పథకం కింద 25మినీగోకులాలు మంజూ రయ్యాయి. దాదాపు 23పూర్తికాగా, రెండు నిర్మాణంలో ఉన్నాయి.

ఘనంగా లలిత సహస్రనామ పారాయణం



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఉదయం ముక్తి రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజ రాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం కర్నూలుకు చెందిన శ్రీమాతా సత్సంగ్ నిర్వాహకురాలు ప్రొఫెసర్ శ్రీదేవి ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణం, సౌందర్యలహరి పారాయణం సామూహికంగా నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత పుష్పయాగం



జమ్మలమడుగు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మెయిన్‌బజార్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం సాయంత్రం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. ఆత్మార్పణ దినం కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారిశాల వద్ద నుంచి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని వివిధ రకాల పూలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రమణ్యం, కేకేపల్లి గంగాధర్, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెలవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాఘమాసం ఆరంభం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి పలునదుల గంగాజలాలు, బావినీటితో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేకఅలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మధ్యాహ్నం వల్లెలవారిపల్లె గ్రామానికి చెందిన రామనబోయిన అయ్యవారయ్య కుటుంబసభ్యులు భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు.

ఎస్సీ బాలుర వసతిగృహం పరిశీలన

కాశినాయన ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): నర్సాపురంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని శనివారం జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరక్టర్ సరస్వతి సందర్శించారు.శుక్రవారం రాత్రి పదో తరగతి విద్యార్థి అవినాశ్‌ను హాస్టల్‌లో పనిచేస్తున్న కమాటి(వంట మనిషి సహాయకుడు)సంగటి రవికుమార్ బెల్ట్‌తో కొట్టాడనే విషయంపై తహసీల్దారు వెంకటసుబ్బయ్యతో కలిసి విచారణచేశారు. దాడి సంఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు అప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాచేశారు. హాస్టల్ సిబ్బంది విద్యార్థులతో అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జరిగిన సంఘటనపై ఆరాతీశారు. అనంతరం డీడీ సరస్వతి పోలీస్ అధికారులను కలిసి వివరాలుఅడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దాడి ఘటనపై సమగ్రంగా విచారించి బాధ్యుడిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత మంచినీటి సరఫరా



జమ్మలమడుగు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో రెండు రోజుల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 15 వార్డుల్లో ఉచితంగా మంచినీటి సరఫరా చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని దొమ్మరనంద్యాల పంప్‌హౌస్ వద్ద రిపేర్లు, క్లీనింగ్ కారణంగా జమ్మలమడుగు మున్సిపాలిటీకి రెండు రోజుల నుంచి అధికారులు మంచినీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పట్టణంలోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సౌజన్యంతో ప్రతి వార్డులో మంచినీటి సరఫరా చేశారు. దీంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కాగా రెండు రోజుల నుంచి పంప్‌హౌస్ వద్ద జరుగుతున్న పనులను కమిషనర్ వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆవిష్కరించారు. శనివారం కామనూరులో ఎమ్మెల్యే నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు నంద్యాల కొండారెడ్డి, నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రామూనాయుడు, లక్ష్మీనరసింహ, సిద్ధయ్య, మచ్చా నాగభూషణం, చాంద్ బాషా, తాటి సుధాకర్‌యాదవ్, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరులో సామాజిక సమరసత యాత్ర



కోలాటం వేస్తున్న దృశ్యం

దువ్వూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో శనివారం విశ్వహిందూ పరిషత్‌కు సంబంధించిన దక్షిణాంధ్ర సామాజిక సమరసత యాత్ర జరిగింది. యాత్రలో బ్రహ్మ ఉపాసకుడు, ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ పరిరక్షణ వేదిక అధ్యక్షుడు బ్రహ్మ యోగానంద కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. దారి వెంట ఆయనకు భక్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలాటం చేస్తూ మహిళలు అలరించారు.

వైభవంగా మల్లెం కొండేశ్వరస్వామి గ్రామోత్సవం

గోపవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లెంకొండేశ్వరస్వామి విగ్రహం గొడుగుతో పురవీధుల్లో భక్తులకు దర్శనమి చ్చారు.పలువురు భక్తులందరూ మంచినీరు వారు పోసి టెంకాయలు సమర్పించారు. మొట్టమొదటిసారిగా బద్వేలు పట్టణంలో మల్లెంకొండేశ్వరస్వామి గ్రామోత్సవం రావడం పట్ల విశేష సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించు కున్నారు. స్వామివారు మెరవణి వెంట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామోత్సవంలో సీఐ రాజగోపాల్, ఆలయ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఫీజుపోరు పోస్టర్లను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన వైసీపీ ఫీజు పోరు విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ నిరసన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రుషికేశవరెడ్డి, గిరిధర్‌రెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, బోనం సురేష్, కొండారెడ్డి, గంగాధర్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలు రద్దు చేస్తాం'

ముద్దనూరు ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో కనీసం బేస్మెంట్ కూడా ఏర్పాటు చేసుకోని లబ్ధిదారుల ఇళ్ల స్థలాలు రద్దు చేస్తామని జరుగుతుందని హౌసింగ్ ఏఈ గురురాజ తెలిపారు.మండలంలో 16 హౌసింగ్ లేఅవుట్‌లు ఉన్నాయన్నారు.అన్ని చోట్లా వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు.లేకుంటే ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థలం రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ముద్దనూరు ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను సాధారణ తనిఖీలో భాగంగా శనివారం ఏవో వెంకటకృష్ణారెడ్డి తనిఖీ చేశారు.అందులో భాగంగా దుకాణాల లైసెన్సులు స్టాక్ నిల్వలు, ఎరువుల రిజిస్టర్‌లు,పురుగుల మందులను పరిశీలించారు.ఎరువుల దుకాణంలో లైసెన్సు ప్రదర్శించాలని,స్టాక్ బోర్డు, ధరల పట్టిక రైతులకు కన్పించేలా ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని దుకాణ దారులకు ఏవో సూచించారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న జడ్జి

ఖాజీపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని అయ్యప్పస్వామిని ప్రొద్దుటూరు జడ్జి జీఎస్. రమేష్‌కుమార్ దర్శించుకున్నారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ క్రిష్టారెడ్డి, సభ్యుడు రాఘవరెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ఒప్పించి బీసీ కులగణనను చంద్రబాబు నెరవేర్చాలి

బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు



మాట్లాడుతున్న బొర్రా రామాంజనేయులు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణను చంద్రబాబు కేంద్ర ప్రభు త్వాన్ని ఒప్పించి నెరవేర్చాలని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం ఆశ్రమం వీధిలోని బీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు బీసీలకు రక్షణ చట్టం తెస్తానని వారిపై వివక్ష, దాడులు జరగకుండా రక్షణగా పటిష్టమైన చట్టం తెస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కులగణను చేపట్టి బీసీలకు చట్టబద్ద రిజర్వేషన్లు అమలుచేస్తామని చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగంగా వున్న టీడీపీ బీసీలను నిజంగా సామాజిక న్యాయం అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కులగణన జరిగేలా ఒప్పించాల్సిన బాధ్యత చంద్రబాబుదన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఎవరి దయాదాక్షిణ్యాలతో అమలు చేయవలసిన అవసరం లేదని కులగణన జరిపితే బీసీల జనాభా దామాషాప్రకారం 50 శాతం చట్టబద్దంగా విద్యా ఉద్యోగాలతో పాటు రాజకీయ రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. బీసీలకు కార్పొరేషన్ల ద్వారా అందించే రుణ సహాయం బాగా తగ్గించారన్నారు. ఇది ఏ మాత్రం బీసీల సామాజిక స్థితి గతులను ప్రభావితం చేయలేదన్నారు. సమావేశంలో బీసీ ప్రజాచైతన్య సమాఖ్య కార్యదర్శి దేవేంద్రుడు కోశాధికారి సంటెన్న, వేల్పుల భాస్కర్, జీసీ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.